క్లుప్తంగా

పెద్దమ్మ ఆలయంలో పూజలు



పూజలందుకున్న పెద్దమ్మ తల్లి

తాడిమర్రి: స్థానిక ఎస్సీ కాలనీలోని పెద్దమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ పూజారి అమ్మవారి మూలవిరాట్‌కు వెండి ఆభరణాలు తొడిగి, పూలమాలలతో అందంగా అలంకరించారు. భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేసి, కొబ్బరి కాయలు సమర్పించి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

గంగమ్మకు బోనాల ఊరేగింపు



వంచిరెడ్డిపల్లిలో గ్రామదేవత గంగమ్మకు బోనాలు సమర్పిస్తున్న మహిళలు

ఓడీ చెరువు: మండలంలోని వంచిరెడ్డిపల్లిలో ఆదివారం గ్రామ దేవత గంగమ్మకు మహిళలు బోనాలు సమర్పించారు. ఈ ఏడు వర్షాలు సమృద్ధిగా కురిసి, పాడిపంటలు బాగా పండాలని కోరుతూ వేడుకున్నారు. బోనాలు సమర్పించిన అనంతరం జంతు బలి ఇచ్చారు. ఈ సందర్భంగా లాయర్ కృష్టారెడ్డి మాట్లాడుతూ.. ఏటా అమ్మవారికి బోనాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు నరసింహులు, రవీంద్రా రెడ్డి, వెంకటరమణ,శివరామిరెడ్డి, మనోహన్ రెడ్డి, ఆదినారాయణ, శేషాద్రి, లక్ష్మీనరసప్ప, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అధిక ఫీజులు వసూలు చేస్తే చర్యలు

ముదిగుబ్బ: ప్రభుత్వ నిబంధనల మేరకే ప్రైవేట్ పాఠశాలలను నడుపుకోవాలని ఎంఈఓ సుధాకర్‌నాయక్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో నిబంధనల మేరకు అడ్మిషన్లు చేసుకోవాలని సూచించారు. అధిక ఫీజులు వసూలు చేయకూడదన్నారు. విద్యార్థులకు పాఠశాలలో అన్ని సౌకర్యాలను కల్పించాలన్నారు. ముఖ్యంగా క్వాలిఫైడ్ టీచర్లను నియమించుకోవాలన్నారు. ప్రభుత్వ గుర్తింపు తప్పనిసరిగా ఉండాలన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేద్దాం



మాట్లాడుతున్న మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వరప్రసాద్

బత్తలపల్లి: ప్రస్తుతం వాతావరణ కాలుష్యంతో నిండిపోయిందని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వరప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలో పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రైవేట్ వాహన డ్రైవర్లకు అవగాహన కల్పించారు. బత్తలపల్లి కూడలిలో డ్రైవర్లను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. వాతావరణం కాలుష్యం కాకుండా ప్రతి పౌరుడు పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలన్నారు. వాతావరణం కాలుష్యం కావడంతో ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరుగుతున్నాయన్నారు. కాలుష్య నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం డ్రైవర్లు, ప్రయాణికులతో పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు అవుతామంటూ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో బత్తలపల్లి పోలీసులు, కదిరి ప్రాంతీయ రవాణా కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి



మాట్లాడుతున్న బూత్ కమిటీ కన్వీనర్ సద్దపల్లి ఆదినారాయణరెడ్డి

నల్లమాడ: మండలంలో పోలింగ్ బూత్‌ల వారీగా వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేసేందుకు తమవంతు కృషి చేస్తామని బూత్ కమిటీ కన్వీనర్ సద్దపల్లి ఆదినారాయణరెడ్డి, కో–కన్వీనర్లు నారపరెడ్డి, అంజి తెలిపారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కుళ్లాయినాయక్‌తో కలిసి ఆదివారం నల్లమాడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ముందుగా తమపై నమ్మకం ఉంచి వైఎస్సార్‌సీపీ తరపున బూత్ కమిటీ కన్వీనర్‌గా, కో–కన్వీనర్లుగా నియమించిన ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే నమ్మకాన్ని వమ్ము చేయకుండా మండల వ్యాప్తంగా ప్రతి బూత్‌ను సందర్శించి స్థానిక నాయకులు, కార్యకర్తల సహకారంతో అక్కడి సమస్యలను తెలుసుకుంటామన్నారు. సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కుళ్లాయినాయక్ మాట్లాడుతూ.. పోలింగ్ బూత్‌ల వారీగా 18 ఏళ్లు నిండిన వారిని గుర్తించి ఓటరుగా నమోదు చేయించే బాధ్యత తీసుకోవాలని బూత్ కమిటీ కన్వీనర్లకు సూచించారు. సమావేశంలో సింగిల్ విండో డైరెక్టర్ గోపాల్‌నాయుడు, నాయకులు కమలాకర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే మైనార్టీల సంక్షేమం

- ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి

కొత్తచెరువు: రాష్ట్రంలో మైనార్టీల సంక్షేమానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో షాదీఖానా పునఃప్రారంభోత్సవం, నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించారు. షాదీఖానాను ప్రారంభించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. మైనార్టీల సంక్షేమానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. రాజకీయపరంగా ఎన్నో పదవులను మైనారిటీలకు కేటాయించడం జరిగిందన్నారు. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక మైనార్టీల కోసం ప్రత్యేక నిధులు కేటాయించడం జరిగిందన్నారు. పార్టీలకు అతీతంగా అన్ని సంక్షేమ ఫలాలు అందించడం జరిగిందన్నారు. టీడీపీ పాలనలో మైనార్టీలకు పథకాలు అందలేదని తెలిపారు. గతంలో మంత్రిగా పని చేసిన పల్లె రఘునాథ్ రెడ్డి.. మైనార్టీల అభివృద్ధికి చేసింది శూన్యమన్నారు. పుట్టపర్తి నియోజకవర్గంలో గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం చేపట్టడం జరిగిందని తెలిపారు. ప్రతి ఇంటికీ వెళ్లి లబ్ధిదారులను పలకరిస్తే.. ఇంతకంటే అభివృద్ధి ఏ ప్రభుత్వం చేసిందని ప్రజలు చెబుతున్నారని వివరించారు. నేడు మహిళలకు ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అందిస్తోందని వెల్లడించారు. కొత్తచెరువులో షాదీఖానా అభివృద్ధికి రూ.35 లక్షల నిధులు విడుదల చేయించామన్నారు. త్వరలోనే మైనారిటీల శ్మశాన వాటికకు రెండు ఎకరాల భూమి మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. షాదీఖానా కమిటీ బాగా పని చేసి అభివృద్ధిలోకి తీసుకురావాలని నూతన కమిటీకి సూచించారు.

షాదీఖానా కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం.. షాదీఖానా నూతన కమిటీ చైర్మన్‌గా కోల్‌కార్ జాకీర్ హుసేన్, ఉపాధ్యక్షుడిగా తయ్యుబ్‌ఖాన్, కార్యదర్శిగా అరీష్ అహ్మద్, ట్రెజరర్‌గా షేక్ బాబా ఫక్రుద్దీన్, మెంబర్లు, అసదుల్లా, బాబాఫక్రుద్దీన్, అయ్యూబ్ ఖాన్, జీలాన్‌ఖాన్, దూదేకుల నూర్‌బాషా, జబీవుల్లా, అమీర్ మెంబర్లుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి కమిటీ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు రెడ్డప్ప రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ జగన్మోహన్ రెడ్డి, నాయకులు మటన్ శంకర్, నాగరాజు, జిల్లా అగ్రిబోర్డు చైర్మన్ అవుటాల రమణారెడ్డి, దర్గా కమిటీ మేనేజర్ అతావర్ రహిమాన్, పుట్టపర్తి ఎంపీపీ రమణారెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు అజీజ్, జిల్లా వక్ఫ్‌బోర్డు ఉపాధ్యక్షుడు షాన్‌షేట్, మాజీ సర్పంచ్ శ్యాంసుందర్ రెడ్డి, ఎంపీటీసీలు రఫీ, సాంబశివా రెడ్డి, ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు సోమశేఖర్ రెడ్డి, టౌన్ కన్వీనర్ భాస్కర్, కో–ఆప్షన్ సభ్యుడు మున్వర్, వాల్మీకి శంకర్, పెయింటర్ కేశవ, యల్లప్ప, ఆవుల అశోక్, బాబు, సుబ్బారావు, మారుతి పలువురు మైనారిటీలు, కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

ప్రజలను చైతన్యం చేసే రచనలు అవసరం



ఐక్యత చాటుతున్న జిల్లా రచయితల సంఘం కార్యవర్గ సభ్యులు

పుట్టపర్తి టౌన్: దేశంలో మత సామస్యం, పర్యావరణం దేశభక్తి ఈ మూడు అంశాలపై ప్రజలను చైతన్య వంతులు చేసే విధంగా రచనలు కొనసాగించాలని రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు జాబిలి చాంద్‌బాషా పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని సాయిఆరామంలో జిల్లా రచయితలతో సమావేశం నిర్వహించారు. అనంతరం జిల్లా రచయితల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రస్తుతం దేశంలో ప్రధానంగా ఈ మూడు అంశాలపై ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాస్వామ్య లౌకిక దేశంలో మత సామరస్యం పాటించాలన్నారు. అలాగే రోజురోజుకు క్షీణిస్తున్న పర్యావరణాన్ని కాపాడాల్సిన ఆవశ్యకత ఉందని తెలిపారు. దేశంలో మత కల్లోలాలు పెరిగిపోతున్నాయన్నారు. దేశం అస్తవ్యస్తంగా మారకుండా కాపాడాల్సిన అవసరం రచయితలపై ఉందన్నారు. ఇందు కోసం రచయితలు కృషి చేయాలన్నారు. అనంతరం రచయితల సంఘం నూతన జిల్లా కార్యవర్గం ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా ఉమర్ ఫారుక్ ఖాన్, కల్లూరు రాఘవేంద్రరావ్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ శివన్న, సహాయ కార్యదర్శులుగా దర్శి షేక్‌బాబా ఫక్రుద్దీన్, వేణుగోపాలచార్యులు, కోశాధికారిగా జయసింహ, కార్యవర్గ సభ్యులుగా సత్యనిర్ధారన్, ముద్దరంగప్ప, మాణిక్యం ఇనాక్, శ్రీనివాస్, ఉపేంద్ర, శంకర్‌రాజు, ఏటిగడ్డ అశ్వర్థనారాయణ, గంగాధర్, వెంకట పార్థసారధి, చంద్రబాబు తేజ, గౌరవ సలహాదారులుగా ప్రొఫెసర్ కృష్ణారెడ్డి, షేక్ నబీరసూల్, అల్లాబకాష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. కార్యక్రమంలో పర్యావరణ వేత్త భాస్కర్ నాయుడు, శివన్న, తెలుగు రచయితలు, కవులు, బాషాభిమానులు పాల్గొన్నారు.

ముస్లింల పక్షపాతి సీఎం జగన్



శ్మశాన వాటికకు సంబంధించిన పట్టాను అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి

- ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి

నల్లచెరువు: ముస్లింల సంక్షేమానికి సీఎం జగన్ పలు పథకాలు ప్రవేశపెట్టారని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని అల్లుగుండు గ్రామంలో ముస్లింల శ్మశాన వాటికకు సంబంధించిన పట్టాను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ముస్లింలకు ప్రత్యేక ప్రాధాన్యత కల్పించారన్నారు. మైనార్టీల కోసం జగనన్న ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేసి వారి సామాజిక ఆర్థిక పురోగతి కోసం పాటు పడుతుందని పేర్కొన్నారు. జాతీయ రహదారి సమీపంలోని సర్వే నంబర్ 214లో దాదాపు రూ.2 కోట్లు విలువ చేసే 71 సెంట్ల ప్రభుత్వ స్థలాన్ని రాబోవు రోజుల్లో ఈ స్థలానికి సంబంధించి ఎలాంటి ఇబ్బందులు రాకుండా చట్ట భద్రత కల్పించి ముస్లిం శ్మశాన వాటిక కోసం కేటాయించడం జరిగిందన్నారు. అనంతరం గ్రామంలోని ముస్లింలు ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తమ కోసం రూ.కోట్లు విలువ చేసే స్థలాన్ని కేటాయించడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మాజీ సమన్వయకర్త ఎస్‌ఎండీ ఇస్మాయల్, వైస్ ఎంపీపీ నారాయణ స్వామి, సర్పంచ్ బీబీ జాన్, సింగల్‌విండో అధ్యక్షుడు జయచంద్రా రెడ్డి, మండల అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ ముస్తఫా, డైరెక్టర్ ఆదిమూర్తి, నాయకులు మహమ్మద్ అలీ, డీలర్ కృష్ణారెడ్డి, లక్ష్మయ్య, సచివాలయ కన్వీనర్ ఖాజా, ముతవల్లి ఖాజాపీర్, టీచర్ సూర్యనారాయణరెడ్డి, సమీవుల్లా, జిలాన్ బాషా, కరీం తదితరులు పాల్గొన్నారు.

బంజారా సంఘం మండల కమిటీ ఎంపిక



ఐక్యత చాటుతున్న బంజారా కమిటీ సభ్యులు

తలుపుల: స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఆదివారం మండలంలోని ఏడు తండాలకు చెందిన తండాల వాసులు ఏబీఎస్‌ఎస్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చక్రీనాయక్ ఆధ్వర్యంలో బంజారా సంఘం మండల కమిటీని ఎంపిక చేశారు. బంజారా సంఘం మండల అధ్యక్షుడిగా బాలచంద్ర నాయక్, ప్రధాన కార్యదర్శిగా ధర్మానాయక్, గౌరవ అధ్యక్షుడిగా చంద్రానాయక్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా రవినాయక్, ట్రెజరర్‌గా రవీంద్రనాయక్, యూత్ ప్రెసిడెంట్‌గా బాలాజీనాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చంద్రానాయక్, ఉపాధ్యక్షుడిగా రవినాయక్ మరికొంత మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ.. బంజారాల సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించి పరిష్కరించడానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులునాయక్, జిల్లా ప్రదానకార్యదర్శి కాలేనాయక్ పాల్గొన్నారు.

సేఫ్టీ వాల్‌ను ఢీకొన్న ఇన్నోవా కారు



కారులోకి దూసుకెళ్లి వెనుక వైపు బయటకు వచ్చిన సేఫ్టీ వాల్ పైపులు

కనగానపల్లి: మండల పరిధిలోని దాదులూరు సమీపంలో జాతీయ రహదారి పక్కన ఉన్న సేఫ్టీ వాల్‌ను ఇన్నోవా కారు ఢీకొట్టింది. దీంతో ఆ ఐరన్ సేఫ్టీ వాల్ పైపులు కారు ముందు భాగం నుంచి దూసుకెళ్లి వెనుక వైపు నుంచి బయటకు వచ్చాయి. కాని కారులోని ప్రయాణికులు మాత్రం స్వల్ప గాయాలతో త్రుటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు ఆదివారం సాయంత్రం కర్నూల్‌కు చెందిన సురేష్ కుమార్ తన కూతురుతో కలసి బెంగళూరు నుంచి కర్నూల్‌కు వెళ్తున్నారు. దాదులూరు వద్ద వేగంగా వస్తున్న కారు అదుపు తప్పి రహదారి పక్కన ఉన్న సేఫ్టీవాల్‌ను ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. దీంతో కనగానపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

నేటి నుంచి విత్తన వేరుశనగ పంపిణీ

కనగానపల్లి: మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో సోమవారం నుంచి రైతులను రాయితీ వేరుశనగ విత్తన కాయలు పంపిణీ చేస్తామని ఏఓ కృష్ణకుమారి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఖరీఫ్‌లో వేరుశనగ పంట సాగు చేసే రైతులకు ప్రభుత్వం 40 శాతం రాయితీతో విత్తన కాయలు అందజేస్తోందన్నారు. పలువురు రైతులు ఇప్పటికే ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకొన్నారన్నారు. వీరందరికీ ఆయా ఆర్బీకేల పరిధిలోనే గోదాముల వద్దనే విత్తన కాయలు పంపిణీ చేస్తామన్నారు.

బత్తలపల్లి/ఓడీ చెరువు/తాడిమర్రి: రైతు భరోసా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకున్న రైతులకు సోమవారం నుంచి ఆయా ఆర్బీకేల్లో వేరుశనగ విత్తన కాయలు అందజేస్తామని మండల వ్యవసాయాధికారులు ఓబిరెడ్డి, ఇలియాజ్, రమాదేవి ఆదివారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఇంకా విత్తన కాయలకు రిజిస్ట్రేషన్ చేసుకోని రైతులు ఉంటే వెంటనే రిజిస్ట్రేషన్ చేయించుకుని విత్తన కాయలు పొందవచ్చన్నారు. తాడిమర్రిలోని 1,2, పెద్దకోట్ల, దాడితోట, కునుకుంట్ల, పిన్నదరి, చిన్నచిగుళ్లరేవు, నార్పింపల్లి, ఎం.అగ్రహారం, చిల్లవారిపల్లి తదితర 10 రైతు భరోసా కేంద్రాల్లో విత్తన పంపిణీ చేయనున్నారు. తాడిమర్రి మండలానికి 3,248 క్వింటాళ్ల విత్తనం కేటాయించగా.. ఇప్పటి వరకూ 1,110 క్వింటాళ్ల విత్తనం కోసం 1248 మంది రైతులు పేర్లు నమోదు చేసుకున్నారు. కే6 రకం క్వింటాల్ (3 బ్యాగులు) విత్తనం పూర్తి ధర రూ.8,370 కాగా.. ప్రభుత్వ సబ్సిడీ రూ.3,348 పోగా రైతులు రూ.5,022 చెల్లించాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు.

అమడగూరు: మండల వ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామ పంచాయతీల్లో సోమవారం విత్తన వేరుశనగ పంపిణీ చేయనున్నట్లు వ్యవసాయాధికారి జ్యోత్స్న ఆదివారం పేర్కొన్నారు. ఇప్పటి వరకూ రైతుభరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకుని డబ్బులు చెల్లించిన రైతులకు వేరుశనగ కాయలను పంపిణీ చేస్తామన్నారు. రిజిస్ట్రేషన్ చేయించుకున్న సమయంలో రైతులకు ఇచ్చిన రసీదును తీసుకువచ్చి కాయలను తీసుకోవాలన్నారు. మొదటి విడత పంపిణీ పూర్తి కాగానే రెండో విడతకు రిజిస్ట్రేషన్ చేస్తామన్నారు.

సంస్కృతీ విద్యాసంస్థలకు అంతర్జాతీయ గుర్తింపు



అంతర్జాతీయ ప్రమాణాల గుర్తింపు పత్రాన్ని చూపుతున్న కళాశాల సిబ్బంది

ప్రశాంతి నిలయం: సంస్కృతీ స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్, సంస్కృతీ స్కూల్ ఆఫ్ బిజినెస్‌కు అంతర్జాతీయ ప్రమాణాల సంస్థ గుర్తింపు లభించినట్లు ఆ విద్యా సంస్థల పీఆర్‌ఓ నాగరాజు తెలిపారు. ఆదివారం విద్యాసంస్థల కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంస్కృతీ విద్యాసంస్థల్లో అందుతున్న విద్య, మౌలిక సదుపాయాలు, అత్యాధునిక ప్రయోగ శాలలు, సాంకేతిక విద్యా బోధనకు ఈ గుర్తింపు లభించిందన్నారు. ఐఎస్ఓ విభాగం నిపుణుడు కె.వి.హరగోపాల్ నేతృత్వంలో నిర్వహించిన అనేక పరిశీలనలతో విద్యాసంస్థలు పాటిస్తున్న ప్రమాణాలను పరిగణలోకి తీసుకున్నట్లు వెల్లడించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సెంథిల్ కుమార్, అకడమిక్ డీన్ డాక్టర్ బాల కోటేశ్వరి మాట్లాడుతూ.. విద్యార్థులకు చక్కటి బోధన అందించడంతో మంచి ఫలితాలు సాధించడం జరుగుతోందన్నారు. విద్యార్థులకు మంచి కొలువులు దక్కుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో విద్యాసంస్థల హెచ్‌ఓడీలు, బోధనా సిబ్బంది తదితరుల పాల్గొన్నారు.

కల్యాణ మండపానికి వంట పాత్రల వితరణ



దాతలు అందజేసిన పాత్రలు

అమడగూరు: మండలంలో ప్రసిద్ధిగాంచిన చౌడేశ్వరీ ఆలయానికి అనుసంధానంగా నిర్మించిన చౌడేశ్వరీ కల్యాణ మండపానికి కర్ణాటకలోని ముళబాగిళుకు చెందిన నరసింహప్ప దంపతులు రూ.2 లక్షలు విలువ చేసే వంట పాత్రల సామగ్రి వితరణ చేశారు. ఆదివారం ఆలయ ధర్మకర్త పొట్టా పురుషోత్తమ రెడ్డికి పాత్రలు, స్టవ్‌లు, గ్రైండర్‌ను అందజేశారు. కాగా దంపతులకు ఆలయ కమిటీ తరపున కృతజ్ఞతలు తెలిపారు.

అనారోగ్యంతో అటెండర్ మృతి



ఫక్రుద్దీన్ (ఫైల్)

పుట్టపర్తి: బుక్కపట్నంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అటెండర్‌గా విధులు నిర్వహించే ఫక్రుద్దీన్ (47) శనివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందినట్లు సబ్ రిజిస్ట్రార్ శీనానాయక్ పేర్కొన్నారు. కాలేయ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఆయన ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఫక్రుద్దీన్ మృతికి కార్యాలయ సిబ్బంది సంతాపం తెలిపారు. కాగా మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

తాగునీటి పైపులైన్ ఏర్పాటు



తాగునీటి పైపులైన్ వేయిస్తున్న వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జ్ కోటిరెడ్డి బాలిరెడ్డి

ధర్మవరం: పట్టణంలోని సుందరయ్య నగర్‌లో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడకుండా పైపులైన్ వేయించామని వార్డు కౌన్సిలర్ కోటిరెడ్డి సుజాత, వార్డు ఇన్‌చార్జ్ కోటిరెడ్డి బాలిరెడ్డి తెలిపారు. ఆదివారం సుందరయ్యనగర్‌లో తాగునీటి పైపులైనును వేయించి ప్రజల దాహార్తిని తీర్చారు.

ఫుట్‌బాల్ టోర్నీ విజేత 'పురం'

హిందూపురం టౌన్: బెంగళూరులో ఆదివారం జరిగిన అండర్–10 ఇన్విటేషనల్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో హిందూపురం జట్టు విజేతగా నిలిచింది. ఫైనల్ మ్యాచ్‌లో హోస్టింగ్ టీమ్ గౌతమ్స్ ఫుట్‌బాల్ క్లబ్‌తో యునైటెడ్ ఫుట్‌బాల్ క్లబ్ హిందూపురం జట్టు తలపడ్డాయి. హిందూపురం జట్టు 4–0 తేడాతో విజయం సాధించింది. హిందూపురం జట్టులో నోబుల్ మూడు గోల్స్ చేయగా, లవీన్ రిషి ఒక గోల్‌తో సత్తా చాటి విజయఢంకా మోగించారు. ఈ సందర్భంగా గెలుపొందిన జట్టుకు ట్రోఫీతో పాటు ప్రశంసాపత్రాలను అందజేశారు. మూడు గోల్స్‌తో ప్రతిభ కనబరిచిన నోబుల్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ దక్కింది. ఈ సందర్భంగా టీమ్ కోచ్‌లు బీకే మహమ్మద్ సలీమ్, సాయిలతా, అయిషాలు క్రీడాకారులను అభినందించారు.

నేడు స్పందన

తాడిమర్రి: మండలంలోని గ్రామ సచివాలయాల్లో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ నాగరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తాడిమర్రిలోని రెండు, పెద్దకోట్ల, పిన్నదరి, దాడితోట, కునుకుంట్ల, ఎం.అగ్రహారం తదితర 10 సచివాలయాలతో పాటు తహసీల్దార్ కార్యాలయంలో కూడా స్పందన నిర్వహిస్తామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే స్పందన కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, మండల అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.

బత్తలపల్లి: మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో సోమవారం స్పందన కార్యక్రమం ఉంటుందని తహసీల్దార్ యుగేశ్వరిదేవి ఆదివారం తెలిపారు. మండలంలోని 11 గ్రామ సచివాలయాల్లో సచివాలయ ఉద్యోగులు ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తారన్నారు. అదేవిధంగా మండల స్థాయిలో జరిగే స్పందన కార్యక్రమానికి మండలస్థాయి అధికారులందరూ హాజరు కావాలని సూచించారు. ప్రజలు కూడా ఏవైనా సమస్యలుంటే వినతిపత్రాలు అందజేయవచ్చన్నారు.

పావగడలో ఇల్లు దగ్ధం

పావగడ: పట్టంణంలోని గుట్టహళ్లిలో ఆదివారం జరిగిన అగ్నిప్రమాదంలో ఓ ఇల్లు దగ్ధమైంది. వివరాలు...కోర్టు వెనుక భాగం గుట్టహళ్లి ప్రాంతానికి చెందిన మహేశ్వరి శనివారం రాత్రి దేవుని పూజ చేయడానికి దేవుడి చిత్రపటం వద్ద దీపం వెలిగించింది. అయితే ఆ దీపం కిందకు పడి దుస్తులు అంటుకుని ఆ మంటలు ఇల్లంతా వ్యాపించి వస్తువులు, పరికరాలన్నీ కాలి బూడిదైపోయాయి.

నూతన కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ కమిటీ సభ్యులు

కదిరి టౌన్: యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ కదిరి తాలూకా కమిటీని ఆదివారం స్థానిక ఎన్జీఓ హోమ్‌లో ఎన్నుకున్నారు. కదిరి తాలూకా గౌరవాధ్యక్షుడిగా జీఎల్ నరసింహులు, తాలూకా అధ్యక్షుడిగా ఎస్.సూర్యనారాయణ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా హరినాథ్‌రెడ్డి, కోశాధికారిగా ధనుంజయ రెడ్డి, ఉపాధ్యక్షులుగా నిజాముద్దీన్, సుధాకర్ రాజు, ఉమా మహేష్, బాండ్‌ఖాన్, జాయింట్ సెక్రటరీలుగా ప్రతాప్‌రెడ్డి, జయరాం, వై.నరసింహులును ఎన్నుకున్నారు. వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగుల సమస్యలపై పోరాడుతామని తెలిపారు. కార్యక్రమంలో యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ సత్యసాయి జిల్లా అధ్యక్షుడిగా నామాల ఈశ్వరయ్య, ఉపాధ్యక్షులు వై.వాసుదేవ రెడ్డి, చెన్న కేశవరెడ్డి, సీఐటీయూ నాయకులు జీఎల్ నరసింహులు, సాంబశివ పాల్గొన్నారు.

నేడు గాండ్లపెంటలో బైక్ ర్యాలీ

గాండ్లపెంట: మండల కేంద్రంలో సోమవారం ఉదయం 8 గంటలకు బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు మండల కన్వీనర్ పోరెడ్డి చంద్రశేఖరరెడ్డి ఆదివారం తెలిపారు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి 4 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా వైఎస్సార్ కూడలి నుంచి కదిరికి బైక్ ర్యాలీగా వెళ్తామన్నారు. అక్కడ ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి ఆధ్వర్యంలో కదిరిలో నిర్వహించే బైక్ ర్యాలీకి సంఘీభావం తెలుపుతామన్నారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ మండల నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీపీ, ఎంపీటీసీలు, డైరెక్టర్‌లు, సచివాలయ కన్వీనర్‌లు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

ఆధ్యాత్మిక గ్రంథాల వితరణ



గ్రంథాలయానికి ఆధ్యాత్మిక గ్రంథాలను వితరణ చేస్తున్న ప్రబోధానంద సేవాసమితి సభ్యులు

ఓడీ చెరువు: ప్రబోధానంద సేవాసమితి ఆధ్వర్యంలో ఆదివారం కొండకమర్ల గ్రామంలోని గ్రంథాలయానికి సేవాసమితి సభ్యులు ప్రసాద్, బాలకృష్ణ, నాగరాజు, చంద్రశేఖర్ తదితరులు భగవద్గీతతో పాటు మరో 32 ఆధ్యాత్మిక గ్రంథాలను గ్రంథాలయాధికారి రాజాబాబుకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నేటి సమాజానికి ఆధ్యాత్మిక చింతన ఎంతో అవసరం అన్నారు. ఆధ్యాత్మిక భావనను పెంపొందించుకునేందుకు ఈ గ్రంథాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. గ్రంథాలయానికి వచ్చే పాఠకులు ఆధ్యాత్మిక గ్రంథాలను చదవాలన్నారు. కార్యక్రమంలో సేవాసమితి సభ్యులు అశోక్, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

బీడీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కదిరి టౌన్: పట్టణంలో నిజాంవలి కాలనీ, వలీసాబ్ రోడ్డులో ఆదివారం సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు పర్యటించారు. బీడీ కార్మికుల సమస్యలను తెలుసుకున్నారు. ప్రభుత్వం స్పందించి కార్మికులందరికీ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. బీడీ కార్మికుల పిల్లలకు ప్రత్యేక స్కాలర్‌షిప్స్ మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు తాజుద్దీన్, రామ్మోహన్, ముస్తాక్, జీఎల్ నరసింహులు, ఫాజిల్ తదితరులు పాల్గొన్నారు.

చెరువులో పూడికతీత పనులు



పూడికతీత పనులు చేస్తున్న కూలీలు

మడకశిరరూరల్: ఆమిదాలగొంది చెరువులో ఉపాధి నిధులతో చేపట్టిన పూడికతీత అమృత్ సరోవర్ పనులు ఆదివారం జోరుగా సాగాయి. ఇటీవల డ్వామా పీడీ రామాంజనేయులు చెరువులో అమృత్ సరోవర్ పనులను పరిశీలించి పనులు నత్తనడకగా జరుగుతున్నాయని సిబ్బందిపై మండిపడ్డారు. దీంతో మండలంలోని 5,500 మందిపైగా ఉపాధి కూలీలతో చెరువులో పూడికతీత పనులను చేయించారు. ఒకే రోజే ఇంత మంది కూలీలు పనులు చేయడంతో చెరువులో పండుగ వాతావరణం ఏర్పడింది.